క్లుప్తంగా

టూ టౌన్ ఎస్ఐగా శోభారాణి



మదనపల్లె సిటీ: మదనపల్లె టు టౌన్ ఎస్ఐగా శోభారాణి ఆదివారం బాధ్యతలు చేపట్టారు. తంబళ్లపల్లె పోలీసుస్టేషన్‌లో ఎస్ఐగా పని చేస్తూ మదనపల్లెకు బదిలీ అయ్యారు. ఆమె టు టౌన్ సి.ఐ మురళీకృష్ణను మర్యాదపూర్వకంగా కలిశారు. పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.

బాహ్య నందీశ్వరస్వామికి అభిషేకాలు

మదనపల్లె సిటీ: స్థానిక బెంగుళూరు రోడ్డులోని శ్రీ యోగభోగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం త్రయోదశి పురస్కరించుకుని ప్రదోషకాలంలో బాహ్య నందీశ్వరస్వామికి విశేష అభిషేకాలు నిర్వహించారు. యోగభోగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

శ్రీహరికోటకు ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ: శ్రీహరికోట రాకెట్ లాంచింగ్ వీక్షించేందుకు మదనపల్లె వన్, టు డిపోల నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు నడిపారు. మదనపల్లె టు డిపో నుంచి 41 బస్సుల్లో 2,100 మంది విద్యార్థులు శ్రీహరికోటకు వెళ్లినట్లు డీఎం ఆర్‌సి నిరంజన్ తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా డిపో నుంచి అత్యధికంగా బస్సులు నడిపినట్లు పేర్కొన్నారు. పండుగ సెలవులు వరుసగా రావడంతో కలిసి వచ్చినట్లు తెలిపారు. వన్‌డిపో నుంచి 21 బస్సులు నడిపినట్లు డిఎం మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు.

గర్నిమిట్ట యల్లమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో గర్నిమిట్ట యల్లమ్మతల్లి

కేవీపల్లె: మండలంలోని గర్నిమిట్టలో వెలసిన శ్రీ యల్లమ్మతల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం ఉదయం అమ్మవారికి అభిషేకం, వివిధ రకాల పుష్పాలతో అలంకరణ, ప్రత్యేకపూజలు, మంగళహారతి చేశారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు మంగళవాయిద్యాలతో బోణాలు ఊరేగింపుగా తీసుకొచ్చి ఆలయ ప్రదక్షిణలు నిర్వహించారు. అమ్మవారికి బోణాలు సమర్పించి మొక్కుబడులు చెల్లించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

క్రీడాకారులు పేర్లు నమోదు చేసుకోవాలి

మదనపల్లె సిటీ: ఆడుదాం ఆంధ్రా క్రీడా చాంపియన్‌షిప్‌లో పాల్గొనున్న క్రీడాకారులు తమ పేర్లను ఆయా సచివాలయాల్లో నమోదు చేసుకోవాలని డీఎస్‌డీఓ షేక్‌షఫీ తెలిపారు. శాప్ నిర్వహించే ఆడుదాం ఆంధ్రా క్రీడా ఛాంపియన్‌షిప్‌లో గ్రామ, వార్డు సచివాలయ స్థాయిలో గెలిచిన జట్టుకు రాష్ట్ర స్థాయిలో తలపడే అవకాశముందన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, క్రికెట్, బ్యాడ్మింటన్ (డబుల్స్ విభాగం)లో పోటీలు జరుగుతాయన్నారు. 17 ఏళ్లు నిండిన పరుషులు,మహిళలు పోటీల్లో పాల్గొనవచ్చునన్నారు.ఈ అవకాశాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మేడికుర్తి పీహెచ్‌సీలో చురుగ్గా అభివృద్ధి పనులు



ఆసుపత్రి ఆవరణలో మట్టి తరలింపు పనులు

కలికిరి: మండలంలోని మేడికుర్తి పీహెచ్‌సీలో పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆదేశాల మేరకు అభివృద్ధి పనులు చేపట్టినట్లు మండల ప్రత్యేక ఆహ్వానితుడు రత్నశేఖర్ రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వాసుపత్రికి వచ్చే రోగులకు ఆహ్లాద వాతావరణం కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. మట్టితరలింపు, చదును చేయడంతో పాటు ఆసుపత్రి ఆవరణలో మొక్కలు పెంపకం చేపట్టనున్నట్లు ఆయన వివరించారు.

ముగిసిన వాహనాల వేలంపాట

రామసముద్రం: రామసముద్రం పోలీస్‌స్టేషన్ ఆవరణలో వివిధ మద్యం కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను ఆదివారం ఎస్పీ ఆదేశాల మేరకు స్థానిక ఎస్ఐ చంద్రశేఖర్ వేలంపాట నిర్వహించారు. 12 ద్విచక్రవాహనాలకు గాను 10 వాహనాలను మాత్రమే వేలంపాటలో పాటదారులు పాడుకున్నారని తెలిపారు. ఈ వేలంపాటతో రూ.1,80,850లు ఆదాయం చేకూరినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఇంటి స్థలాలకు మార్గం సుగమం

- నెరవేరనున్న ఆర్టీసీ ఉద్యోగుల కల
- తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ రెడ్డి



మాట్లాడుతున్న తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, పీలేరు మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి

పీలేరు : పీలేరు పట్టణంలో ఆర్టీసీ ఉద్యోగులకు కేటాయించిన ఇంటి స్థలాల్లో నిర్మాణాలకు మార్గం సుగమం అయిందని తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి అన్నారు. ఆదివారం కోటపల్లెలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ పీలేరు ఆర్టీసీ డిపోలో 2014–15లో 450 మంది ఉద్యోగులు ఒక్కొక్కరు రూ. 40 వేలు చెల్లించి మండలంలోని యర్రగుంట్లపల్లె పంచాయతీలో దాదాపు 19 ఎకరాల భూమిని కొనుగోలు చేశారన్నారు. ఇంటి నిర్మాణాల కోసం స్థలాన్ని చదును చేసుకోగా, 2016లో ఆ స్థలంలో అవకతవకలు జరిగినట్లు ఆర్టీసీ హౌసింగ్ సొసైటీపై కొందరు కోర్టును ఆశ్రయించినట్లు చెప్పారు. ఏడేళ్లుగా సాగి ఈ వివాదం ఎట్టకేలకు రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ప్రత్యేక చొరవ చూపి ఇరు వర్గాల మధ్య రాజీ కుదుర్చడంతో సమస్య పరిష్కారం అయిందని వివరించారు. 450 కుటుంబాలకు ఇంటి స్థలాలు లభించినట్లు అయిందని చెప్పారు. ఇది వరకే ఆర్టీసీ ఉద్యోగులకు లక్కీడిప్ పద్ధతిలో ప్లాట్లు కేటాయించినట్లు తెలిపారు. పలువురు ఆర్టీసీ ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. జి.వి. రాకేష్‌రెడ్డి, పీలేరు సర్పంచ్ డాక్టర్ హబీబ్ బాషా, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దండు జగన్మోహన్‌రెడ్డి, ఎంపీటీసీ నరసింహారెడ్డి, నాయకులు విజయశేఖర్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, మహేశ్వర్ రెడ్డి, అబీద్, సి.వి. రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సంచార జాతులను ప్రభుత్వం ఆదుకోవాలి



సమావేశమైన సంచార సంఘం నేతలు

కలికిరి: సంచార జాతులను ప్రభుత్వం ఆదుకోవాలని సంచార జాతుల సంఘం నాయకుడు గోవిందు వెంకటరమణ డిమాండ్ చేశారు. మండలంలోని తుమ్మలపేట, వడ్డిపల్లి, జడావాండ్లపల్లి, చింతమాకులపల్లి, అంకెంవారిపల్లి, చెరువు ముందరపల్లి, కొత్తపల్లి, కొటాల, కలికిరి పట్టణ పరిధిలోని కాలేజి రోడ్డు కొత్త ఇళ్ల తదితర ప్రాంతాల్లో సంచార జాతుల ప్రజలు నివశిస్తున్నారని, వీరికి 90శాతం రాయితీతో కార్పోరేషన్ నిధులు విడుదల చేయాలన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా గోవిందు వెంకటరమణ, మహిళ అధ్యక్షురాలుగా చెన్నూరి నీలమ్మ, ఉపాధ్యక్షులుగా యల్లయ్య, సంపూర్ణ, కార్యదర్శులుగా సుబ్రమణ్యం, ఉమాదేవిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఆలయ నిర్మాణానికి భక్తుల విరాళం



గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లెలో వెలసిన శ్రీ రెడ్డెమ్మతల్లి ఆలయానికి వైఎస్సార్ జిల్లా కడప నగరానికి చెందిన భక్తులు బులుసా చంద్రహాసకుమార్,వరలక్ష్మీ రూ.25,116 విరాళంగా ఇచ్చారు. ఈ మొత్తాన్ని గర్భాలయ నిర్మాణ పనులకు వినియోగించాలని ఆలయ ఈవో మంజులను కోరారు. అనంతరం డబ్బును ఈఓకు అందజేశారు. విరాళం మొత్తాన్ని వాల్మీకిపురం సప్తగిరి గ్రామీణ బ్యాంకులో జమ చేస్తామని ఈవో తెలిపారు.

ఐక్యంగా సమస్యలు పరిష్కరించుకుందాం



సమావేశంలో మాట్లాడుతున్న విశ్రాంత ఉద్యోగుల సంఘం ఉద్యోగి

వాల్మీకిపురం: విశ్రాంత ఉద్యోగులందరం కలసికట్టుగా సమస్యలను పరిష్కరించుకుందామని విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శంకరయ్య అన్నారు. ఆదివారం పట్టణంలోని కొత్తపేటవీధిలో ఏర్పాటు చేసిన తాలూకా విశ్రాంత ఉద్యోగుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విశ్రాంత ఉద్యోగుల సమస్యలపై ఉమ్మడి పోరాటం చేస్తామన్నారు. మన సంఘంలో ఎవరికైనా సమస్యలు తలెత్తితే, ఆ సమస్యలను విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారం కోసం పని చేస్తోందన్నారు. వాల్మీకిపురంలో తాలూకా విశ్రాంత ఉద్యోగుల సమావేశ భవన నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సహకారంతో అడుగులు వేస్తున్నామని, త్వరలోనే ఈ ప్రక్రియను ప్రారంభిస్తామన్నారు. విశ్రాంత ఉద్యోగులు మురళి, సారధి, బివి రమణ, గోపాల్, క్రిష్ణమూర్తి, నజీర్ సాహెబ్, రామమూర్తి, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవకు సంపూర్ణ సహకారం

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

వాల్మీకిపురం: సమాజ సేవా కార్యక్రమాలకు సంపూర్ణ సహకారం అందిస్తామని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక భగవాన్ సత్యసాయి మందిరంలో మానవతా సంస్థ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఆక్సిజన్‌తో కూడిన అంబులెన్స్‌ను అందిస్తామన్నారు. సంస్థ ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా ఇప్పటికే పలు సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజలు మన్ననలు పొందారన్నారు. మండల వ్యాప్తంగా వైకుంఠ రథం, ఫ్రీజర్ బాక్సుల సౌకర్యాలను నిరుపేదలతో పాటు ప్రజలకు ఉచితంగా అందించడం అభినందనీయమన్నారు. ఆర్థికంగా సహకారం అందించడమే సేవ కాదని, మన వల్ల అయ్యేంత సంస్థకు చేతిపని చేయడం కూడా సేవా కార్యక్రమమేనన్నారు. ప్రతి ఏటా సంస్థకు సభ్యులందరూ సహకారం అందించి, సేవా కార్యక్రమాలు నిర్వహించడం శుభపరిణామమన్నారు. ఈ సందర్భంగా సంస్థకు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి రూ.10,116, ఉదయ్ కుమార్ రెడ్డి, శ్రీనివాసాచార్యులు తదితరులు రూ.10,116 నగదును సంస్థకు విరాళంగా అందించారు. అలాగే హిందూ స్మశానవాటిక నిర్మాణానికి తనవంతుగా రూ.లక్ష అందిస్తున్నట్లు తబ్జుల ఆనందశెట్టి తెలిపారు. జిల్లా అధ్యక్షులు క్రిష్ణమూర్తి, సభ్యులు రామక్రిష్టారెడ్డి, శంకర, లక్ష్మీనారాయణ శెట్టి, చింతల ఆనంద రెడ్డి, ఓరుగంటి రమేష్, సారధి, రవి, మహబూబ్‌బాషా, లక్ష్మన్న, మురళి మోహన్, రెడ్డిశేఖర్, కేశవ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

30 లీటర్ల సారా స్వాధీనం

నిమ్మనపల్లె: వేర్వేరు ప్రాంతాల్లో నాటుసారాను తరలిస్తున్న, విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్ట్‌చేసి వారి నుంచి 30 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పి.రామకృష్ణ తెలిపారు. ఆదివారం మండలంలోని గంగాపురంపల్లె, నిమ్మనపల్లె గ్రామ సమీపంలోని ప్రాంతాల్లో నాటుసారా విక్రయస్థావరాలపై దాడిచేశామన్నారు. ఈ దాడుల్లో వాల్మీకిపురం మండలం చింతపర్తి పంచాయతీ మేకలవారిపల్లెకు చెందిన చిన్న వెంకటరమణ, గంగాపురంపల్లెకు చెందిన చరణ్‌లు సారా అమ్ముతుండగా అదుపులోకి తీసుకుని వారి నుంచి 30 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులపై కేసులు నమోదుచేసి రిమాండ్‌కు పంపినట్లు చెప్పారు.

దానగుణం గొప్పది

కలకడ : విద్యార్థి దశనుంచే దాన గుణం కలిగి ఉండాలని సాయిమందిరం ధర్మకర్త సాయిదాసు అన్నారు. ఆదివారం మండలంలోని కె.దొడ్డిపల్లె పంచాయతీ గోపాలపురంలో వెలసిన శ్రీసాయి పాదాలకు వెండి తొడుగులు చేయించాలని విద్యార్థిని వాసంతి రూ.2000 వితరణ చేశారు. భక్తి ద్వారానే ముక్తికి మార్గమని అందరూ దైవ మార్గంలో నడిచి, మంచిని పెంచాలని సూచించారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

వాల్మీకిపురం: మండలంలోని మంచూరు పంచాయతీ సిద్దారెడ్డిగారిపల్లి, పాతమంచూరు, కొత్త మంచూరు, శాకంవారిపల్లి, ఎగువశాకంవారిపల్లి, హరిజనవాడ గ్రామాలో సోమవారం ఉదయం గడప గపడకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ షబ్బీర్ అహ్మద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పాల్గొని, ప్రజా సమస్యలను తెలుసుకొని, పరిష్కార సమస్యలను అక్కడిక్కడే పరిష్కరిస్తారని తెలిపారు. వివిధశాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొనాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మదనపల్లె సిటీ: ద్విచక్రవాహనాన్ని ఆటో ఢీకొన్న సంఘటనలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడిన సంఘటన మదనపల్లె పట్టణం బైపాస్‌రోడ్డులో ఆదివారం రాత్రి జరిగింది. వాల్మీకిపురానికి చెందిన చరణ్(16), వినయ్(20)లు ద్విచక్రవాహనంలో డిమార్టుకు వచ్చి సరుకులు కొనుగోలు చేసి.. తిరుగు ప్రమాణంలో వాల్మీకిపురం వెళుతుండగా బైపాస్‌రోడ్డులో ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో చరణ్, వినయ్ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని 108లో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రేపు వేంకటేశ్వర స్వామి వ్రతకల్పం

రాజంపేట టౌన్ : పట్టణంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం సాయంత్రం 6 గంటల నుంచి శ్రీవారి భక్తసేవా సమితి ఆధ్వర్యంలో వేంకటేశ్వర స్వామి వ్రత కల్పం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు సమితి ప్రతినిధులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

భక్తులతో కిటకిటలాడిన శ్రీరెడ్డెమ్మకొండ

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన శ్రీ రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఈసందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి నైవేద్యం సమర్పించి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. సంతానం కోసం మహిళలు ఆలయపరిసరాల్లో ఆకుపసరు సేవించి కోనేట్లో స్నానమాచరించి తడి బట్టలతో అమ్మవారి ఎదుట వరపడ్డారు.సంతానం కలిగిన భక్తులు అమ్మవారికి చీరె,సారెలతో మొక్కుబడులు చెల్లించుకొన్నారు. పలువురు భక్తులు ఆలయంలో అన్నదానం నిర్వహించారు.



సంతానం కోసం అమ్మవారి ఎదుట ఒరపడిన మహిళలు

లయన్స్‌క్లబ్ ప్లాటినమ్ నూతనకార్యవర్గం ఎన్నిక



లయన్స్‌క్లబ్ ప్లాటినమ్ నూతన కార్యవర్గం

పీలేరురూరల్ : పీలేరు లయన్స్‌క్లబ్ ప్లాటినమ్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక ఎస్వీఎస్ఎస్ కల్యాణ మండపంలో లయన్స్‌క్లబ్ ప్లాటినమ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ జిల్లా గవర్నరు వి. విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ ప్లాటినమ్ సేవలు మరింత విస్తృతం చేయాలని కోరారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఎం. శ్రీహరిరెడ్డి, కార్యదర్శిగా ఏకాంతంరెడ్డి, కోశాధికారిగా ఆమూరి శివఫణీష్‌ను ఎన్నుకున్నారు. సభ్యులుగా వేణుగోపాల్, సంజీవరెడ్డి, ఎ.ఎస్. హుమయూన్, షఫీ, ప్రకాష్, హరి ఎన్నికయ్యారు.

ఇద్దరిపై కేసు నమోదు

కలకడ : దాడిచేసి గాయపరిచిన ఇద్దరిపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సిటిస్వామి తెలిపారు. ఎస్ఐ కథనంమేరకు ..మండలంలోని కె.బాటవారిపల్లె పంచాయతీ ఎస్టీ కాలనీకి చెందిన మూడే .బాబు నాయక్ అతని భార్య శంకరమ్మను అదే గ్రామానికి చెందిన రవినాయక్, రవినాయక్ భార్య సిరీష లు కొట్టి గాయపరిచారు. ఈ ఘర్షణలో గాయపడ్డ శంకరమ్మను 108లో చికిత్స నిమిత్తం పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం ఆదివారం బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ముగిసిన పీర్ల పండుగ



కందుకూరులో పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం

పెద్దతిప్పసముద్రం: మండలంలోని కందుకూరులో వారం రోజులుగా పీర్ల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. హిందూ–ముస్లిం సోదరులు ఐక్యతగా నిర్వహించే ఈ పండుగలో పీర్ల చావడిలో కొలువుంచిన పీర్లను గ్రామ పుర వీధుల్లో ఊరేగించారు. అగ్నిగుండం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి నుంచి ఆదివారం వేకువజామున వరకు జరిగిన జలధి కార్యక్రమంతో పీర్ల ఉత్సవాలు ఘనంగా ముగిసాయి.

అల్లి'వంక'చూడండి సారూ!



అల్లివంకను పూడ్చేస్తున్న ఆక్రమణదారులు

మదనపల్లె : బసినికొండ పంచాయతీలోని అల్లివంక ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. మాదినికొండ నుంచి వచ్చే అల్లివంక పాత ఆర్టీఓ ఆఫీసు వెనుకవైపు నుంచి విఘ్నేశ్వరకుంట వరకు ఉండేది. ప్రస్తుతం హంద్రీనీవా కాలువ వెనుక నుంచి ఉన్నటువంటి అల్లివంకను ఆక్రమణదారులు మెల్లమెల్లగా పూడ్చుకుంటూ వస్తున్నారు. కేఎంఆర్ ఫంక్షన్ హాల్ సమీపంలో ఓ వ్యక్తి తన స్థలాన్ని చదునుచేసుకునే క్రమంలో మెల్లగా వంకను పూడుస్తూ ప్రధానరహదారికి మార్గాన్ని ఏర్పాటు చేస్తున్నాడు. ఈ విషయమై బసినికొండ వీఆర్వో మోహన్‌కు ఫిర్యాదుచేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపించారు. వంక ఆక్రమణ ఇలాగే వదిలేస్తే వర్షం నీళ్లు జాతీయరహదారిపై వెళ్లాల్సి ఉంటుందని, రెవెన్యూ అధికారులు వంక ఆక్రమణలపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

మారణకాండను ఆపి శాంతిని నెలకొల్పాలి



గాంధీ బస్టాండ్ వద్ద నిరసనలు వ్యక్తం చేస్తున్న క్రైస్తవులు, ముస్లింలు

మణిపూర్ ఘటనలపై క్రైస్తవులు, ముస్లింల శాంతియుత నిరసన

వాల్మీకిపురం: మూడు మాసాలుగా హింసాత్మక చర్యలతో అట్టుడుకుతున్న మణిపూర్‌లో మారణకాండను ఆపి శాంతిని నెలకొల్పాలని వాల్మీకిపురంలో ఆదివారం క్రైస్తవులు, ముస్లింలు సామూహిక ప్రార్థనలు చేశారు. స్థానిక సీఎస్ఐ చర్చి నుంచి గాంధీ బస్టాండ్ వరకు మౌన ప్రదర్శన నిర్వహించి, ప్రార్థనలు చేశారు. సందర్భంగా మత గురువులు, ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ లోహాలు, ఖనిజాలు, వనరుల కోసం మానవత్వాన్ని మరిచి గిరిజన తెగకు చెందిన కుకీలపై ప్రభుత్వ పెద్దల అండదండలతో మైతేయీలు తెగవారు ఆటవిక, పాశవిక దాడులకు పాల్పడడం అమానుషమన్నారు. మహిళలను దిగంబరం చేసి తరిమికొట్టడం, అడ్డుపడిన వారిని హతమార్చడం, పోలీసుల ఎదుటే మహిళలపై అత్యాచారాలకు పాల్పడడం వంటి దౌష్ట్యాలు, దురాగతాలకు పాల్పడడం అమానవీయమన్నారు. ఇలాంటి దారుణమైన సంఘటనలతో అట్టుడుకుతున్న మణిపూర్‌లో శాంతిని నెలకొల్పేందుకు ప్రభుత్వ పెద్దలు, ప్రజా సంఘాలు స్పందించాల్సి ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వ పెద్దలు మౌనం వీడి శాంతి భద్రతలు, మహిళలు, పౌరుల రక్షణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. క్రైస్తవులు మేరీ, రాజేష్, జోసెఫ్, ఆర్‌బీకే ఛైర్మెన్ నీళ్లభాస్కర్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్, ముస్లింలు అబ్దుల్ అజీమ్ సాహెబ్, జవాద్‌హుస్సేన్, రియాజ్ సాహెబ్, మహమ్మద్ అలీ సాహెబ్, అబ్దుల్ రహీం సాహెబ్, అమీర్ హుస్సేన్, కరీం సాహెబ్, వైఎస్సార్‌సీపీ నాయకులు రవి, శ్యామ్, పునీత్, పీటర్, శివారుపల్లి సుధాకర్, ఉజాలా, సమీ తదితరులు పాల్గొన్నారు.

అపూర్వ కలయిక



గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

కలకడ : ఒకట్రెండు కాదు 33 ఏళ్ల అనంతరం కలిసిన అపూర్వ సంఘటన ఇది.. అవును.. స్థానిక ఉన్నతపాఠశాలలో 1991–1992 సంవత్సరం 10వ తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం కలకడ మండలం, నడిమిచెర్ల జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శంకరయ్య మాట్లాడుతూ ఉత్తమ భవిష్యత్‌కు పునాది వేసిన ప్రభుత్వ పాఠశాలలను గుర్తుపెట్టుకుని 33 ఏళ్ల అనంతరం పాఠశాల అభివృద్ధికి, ఉపాధ్యాయులను గుర్తించి సన్మానించడం గర్వకారణమన్నారు. నాటి ఉపాధ్యాయులు ఓబుల్‌రెడ్డి, రెడ్డిసుబ్బరాయుడును ఘనంగా సన్మానించి, వారి ఆశీస్సులు పొందారు. వీరు రూ.25వేలు విలువ చేసే మైక్‌సెట్ స్పీకర్లు వితరణ చేశారు. మాజీ సైనిక ఉద్యోగులుప్రభాకర, జనార్ధన్‌రెడ్డి, నాగరాజ, పూర్వ విద్యార్థులు శ్రీనాధుడు, కొత్తపల్లెజనార్ధన్‌రెడ్డి, ప్రభాకర్, మధుసూదన్‌రెడ్డి, అమరనాథ, రామ్మోహన, జ్యోతి, పాల్గొన్నారు.

వీఓఏల హక్కుల సాధనే లక్ష్యం



గాంధీ విగ్రహానికి వినతిపత్రమిస్తున్న వీఓఏలు

వాల్మీకిపురం: ఆంధ్రప్రదేశ్ వెలుగు వీఓఏ (యానిమేటర్స్)ల హక్కుల సాధన కోసం రాష్ట్ర యానిమేటర్స్ ఉద్యోగుల సంఘం ఆదేశాల మేరకు జీపు జాతాలో భాగంగా ఆదివారం వాల్మీకిపురం గాంధీ బస్టాండ్‌లో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి వినతి పత్రమిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు మాట్లాడుతూ వీఓఏలను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం ఇవ్వాలన్నారు. రాజకీయ వేధింపులు లేకుండా జెండర్ విధానాన్ని అమలు చేసి గ్రూప్ ఇన్సూరెన్స్ రూ.10లక్షలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మునిరత్నమ్మ, నిర్మల, ఉమామహేశ్వరి, పుష్పావతి, విద్య, ఖదీరున్నిసా తదితరులు పాల్గొన్నారు.